
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5

ఆదివారం 30 జూన్ 2024

అంజన్న దీవెనలతోనే గెలిచాను..

● ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ● కొండగట్టు అంజన్నను దర్శించుకున్న జనసేనాని



మల్యాల, జూన్ 29: కొండగట్టు అంజనేయస్వామి ఆశీస్సులతోనే తాను ఎదిగానని, ఇప్పుడు ఈ స్థాయికి వచ్చినట్లు, అంజన్న అండతో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన తాను స్వామి వారి దీవేనలతో ఘనవిజయం సాధించినట్లు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. శనివారం పవన్‌కళ్యాణ్ కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కొండగట్టు వచ్చిన పవన్ కళ్యాన్‌కు కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ స్వాగతం పలికారు. వారాహీ దీక్షలో ఉన్న పవన్ తల పాగ, దీక్షాదుస్తులతో ఆలయంలోకి ప్రవేశించారు. ఈవో చంద్రశేఖర్, స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు జితేంద్ర ప్రసాద్, రామకృష్ణ, రఘు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆంజనేయస్వామికి పవన్‌కళ్యాణ్, పళ్లు, వస్త్రాలు సమర్పించగా స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నాక ఆలయంలోనే శ్రీవెంకటేశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు అర్చకులు, వేదపండితులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. దేవస్థానం అధికారులు సత్కరించి స్వామి వారి చిత్రపటం బహుకరించారు.

ఈ సందర్భంగా గతంలో కొండగట్టుకు వచ్చిన సందర్భాలను పవన్ గుర్తు చేసుకున్నారు. పవన్ ఆలయంలో అరగంట ఉండగా అటు తరువాత ఏమీ మాట్లాడ కుండానే తిరిగి వెళ్లిపోయారు. పవన్ వెంట ప్రముఖ అర్కిటెక్ ఆనందసాయి రాగ ఈ కార్యక్ర మంలో కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆలయంలో పలు శాఖల అధికారులు నాయకులు పవన్‌తో సెల్ఫీలు దిగారు

గదుల నిర్మాణం కోసం పవన్‌కు విన్నపాలు

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులకు గదులు సరి పడా లేక ఇబ్బందులు పడుతున్నారని తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా వంద గదుల సత్రం నిర్మాణంతో పాటు రెండు వేల మంది కూర్చునే దీక్ష విరమణ మండపం ఏర్పాటుకు కృషి చేయాలని దేవస్థానం ఈవో చంద్రశేఖర్, ఆలయ అధికారు లు, అర్చకులు పవన్‌కళ్యాణ్‌కు వినతిపత్రం అంద జేశారు. వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తూంటారని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనికి పవన్ సానుకూలంగా స్పందిం చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

తరలివచ్చిన అభిమానులు

పవన్‌కళ్యాణ్ కొండగట్టుకు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగ గల వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. ఉదయం 11 గంటలకు రావాల్సిన పవన్ మధ్యాహ్నం 1గంటకు చేరుకున్నారు. ఉదయం 9 గంటల నుంచే అభిమానులు తరలివచ్చి తమ నేత కోసం వేచి ఉన్నారు. కొండపైన వై జంక్షన్ నుంచి ఆలయం వరకు ఉన్న అభిమానులు బారులు తీరారు. పవన్ వాహన శ్రేణి రావడంతో సీఎం.. సీఎం అంటూ చప్పట్లు, కేరింతలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పవన్ వారందరికి అభి వాదం చేసుకుంటూ ఆలయంలోకి వెళ్లాడు.

దర్శనం అనంతరం బయటకు వచ్చిన పవన్ వాహనం ఎక్కి మరోసారి నమస్కరిస్తూ ముందుకు కదిలారు. అయితే తమ అభిమాన నేతను చూడడానికి వచ్చిన అభిమానులు పోలీసుల తీరుతో అసంతృప్తికి గురయ్యారు. అడు గడుగునా అభిమానుల రాకను నిలువరించడంతో వారితో పాటు మీడియా ప్రతినిధులు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ నేతను చూడడానికి దూర ప్రాంతాల నుంచి వస్తే కనీసం చూడకుండా దూరం పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల మీడియా ప్రతినిధులు, పోలీసులతో వాగ్వాదం కూడా చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు వచ్చి సర్ధిచెప్పారు.

పిఠాపురం నుంచి కొండగట్టుకు..

ఆంధ్రప్రదేశ్‌లోని పవన్‌కళ్యాన్ సొంత నియోజకవర్గం పిఠాపురంతో పాటు ఆ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పవన్ అభిమానులు, జనసేన శ్రేణులు కొండగట్టు వచ్చారు. అయితే వారంతా తమ నాయకున్ని చూడడానికే పరిమితం కాగ కలవడానికి పోలీసులు, భద్రత సిబ్బంది అనుమతించలేదు. దీంతో ఇతర రాష్ట్రం నుంచి వచ్చినా కలిసే ఛాన్స్ రాకపోవడంతో ఊసూరుమంటూ వెళ్లిపోయారు.



కొండగట్టులో అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కళ్యాణ్


ఆలయ వసతి గదుల నిర్మాణం కోసం పవన్‌కు విన్నవిస్తున్న ఈవో

దొంగల ముఠా పట్టివేత

● 260 గ్రాముల బంగారంతో పాటు కారు, మూడు విద్యుత్ మోటార్లు స్వాధీనం

● వివరాలు వెల్లడించిన ఎస్పీ



నిందితులను అరెస్టు చూపిస్తున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, జూన్ 29 : కొద్ది రోజులుగా జగిత్యాల జిల్లా పరిధిలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. 260 గ్రాముల బంగారంతో పాటు ఒక కారు, మూడు విద్యుత్ మోటార్లు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు దొంగలతో పాటు బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన వ్యక్తిని అరెస్టు చూపించి పూర్తి వివరాలను ఎస్పీ అశోక్ కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని తారకరామ నగర్‌కు చెందిన వనం రాము, జగన్నాథ్ అభియా, జగన్నాథ్ మీనయ్య అనే ముగ్గురు కలిసి దొంగ తనాలు చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నారు. తాళం వేసిన ఇళ్లను గమనిస్తూ రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నారు. శనివారం కొడిమ్యాల మండలం జేఎన్‌టీయూ చెక్‌పోస్టు నాచుపల్లి రోడ్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనాలపై వెలుతున్న ముగ్గురు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. విచారణలో వీరు జగిత్యాల జిల్లాలో 11 చోట్ల చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. దోచుకున్న బంగారు ఆభ రణాలను పట్టణంలోని సిద్దార్థ్ జ్యువెల్లర్స్ అధినేత గంగాధర్‌కు విక్రయించినట్లు గుర్తించి గంగాధర్‌ను కూడా అరెస్టు చూపించినట్లు ఎస్పీ వివరించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దొంగలతో పాటు ఆభరణాలను కొనుగోలు చేసిన వ్యక్తిని పట్టుకున్న పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘ చందర్, మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్, హెడ్ కానిస్టేబుళ్లు రాజు, రాజయ్య, సౌందర్య, కానిస్టేబుళ్లు తిరుమల్, చంద్రశేఖర్, వినోద్, రాజు, సాగర్, శ్రీకాంత్, రాకేష్, కళ్యాణ్, స్వప్న, కళ్యాణి, సీడీఆర్ సెల్ పోలీస్ అధికారలు రాజశేఖర్, మహేష్, మల్లేశం ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

అడిషనల్ కలెక్టర్ రఘువరన్

పెగడపల్లి, జూన్ 29 : పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ రఘువరన్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామాన్ని లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ రఘువరన్ శనివారం సందర్శించి ఇల్లిల్లూ తిరిగి ప్రతి ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం ప్రారంబమైనందున వ్యాదులు ప్రభలే ఆస్కారం ఉంటుందని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, అంగన్‌వాడీ కేంద్రాలను, నర్సరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వకం పనులు వేగవంతం చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, అంగన్‌వాడీ కేంద్రాలను, నర్సరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వకం పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ , ఎంపీటీసీ పూసాల శోభాతిరుపతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

వరద కాలువ పనులు ప్రారంభమై నేటికి 31 ఏళ్లు

జగిత్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద ప్రవాహ కాలువ నిర్మాణం కోసం పనులు ప్రారంభమై సరిగ్గా 31 సంవత్సరాలు పూర్తయ్యాయి. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం బస్సాపూర్ వద్ద 1993 సంవత్సరం జూన్ 30వ తేదీన అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు వరద కాలువ పనులు ప్రారంభిస్తూ పునాది రాయి వేసిన శిలాఫలకం ఇప్పటికీ ఉంది. ప్రస్తుతం వరద కాలువ ద్వారా రైతులు పలు జిల్లాలకు చెందిన రైతులకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు సాగు నీరు అందిస్తున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రాయికల్, జూన్ 29: రాయికల్ పట్టణంలోని అన్ని వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ శనివారం పరిశీలించారు. వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సాయంత్రం వార్డుల్లో ఫాగింగ్ చేయాలన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే కళాశాల మూసివేత

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్


కళాశాల ప్రారంభం కోసం సీఎంకు అందించిన వినతి పత్రాన్ని చూపిస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూన్ 29: బీఆర్‌ఎస్ హయాంనే శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల (ఓరియంటల్) మూసి వేశారని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని గోదావరి నదీ తీరాన గల కళాశాలను హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరితో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల భవనాన్ని, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న కొన్ని అనాలోచిత నిర్ణయాల వల్ల ఓరియంట్ కళాశాలలో టీచింగ్ స్టాఫ్ లేక మూసి వేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కళాశాలను తిరిగి ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రాలను అందించానన్నారు. కళాశాలను పున: ప్రారంభించే వరకు హయ్యర్ ఎడ్యుకేషన్ అధికారులతో మాట్లాడి ఔట్ సోర్సింగ్ పద్ధతితో ఉద్యోగులను, పారిశుధ్య సిబ్బందిని, అధ్యాపకులను నియమించాలని తెలిపానన్నారు. అదే విధంగా సీఎం దృష్టికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సాగు, తాగు నీరు విషయమై పలు మార్లు చర్చించానన్నారు. ఎస్టీ బాలుర వసతి గృహంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడి టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై నిర్వహిస్తున్న శిక్షణా సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్‌జేడీ యాదగిరి, తహసీల్దార్ కృష్ణచైతన్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సుమన్, ఆర్‌ఐ వెంకటేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ పాల్గొన్నారు.



శ్రీరాంసాగర్ వెలవెల

● వర్షాలు పడక.. ఎస్సారెస్పీలోకి నీరు రాక ఆందోళన

● డ్యామ్‌లోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో... ఈ సీజన్‌లో 3.550 టీఎంసీలు చేరిక

● గతేడాదితో పోలిస్తే తక్కువ నీటి నిల్వ

● బాబ్లీ గేట్లు ఎత్తి మహారాష్ట్ర నుంచి వచ్చే నీరు..వర్షాలపైనే ఆశలు

● దుక్కులు దున్ని...వరి నారు పోసుకొని రైతన్న ఎదురుచూపులు



జగిత్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు వరప్రదాయినిగా పిలువబడుతున్న శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి అనుకున్న స్థాయిలో వరద నీరు రాకపోవడంతో వెలవెల బోతోంది. ఆశించిన పరంగా వర్షాలు పడక పోవడం, ఎస్సారెస్పీలోకి నీరు రాక పోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. డ్యామ్‌లోకి స్వల్పంగా మాత్రమే వరద నీరు వస్తోంది. గత యేడాది పోలిస్తే డ్యామ్‌లోకి తక్కువగా నీరు వచ్చి చేరుతోంది. మహారాష్ట్రలో బాబ్లీ వద్ద గోదావరి పై నిర్మించిన ప్రాజెక్టు గేట్లను ఎత్తితే వచ్చే నీరు, సమృద్ధిగా వర్షాలు కురిస్తే వచ్చే నీరుపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో రైతులు దుక్కులు దున్ని, వరి నారు పోసుకొని సాగు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణంలో ప్రస్తుతం కేవలం ముప్పది శాతం మాత్రమే వివిధ పంటలను రైతులు వేశారు.

ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీరు ..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ప్రస్తుతం స్వల్పంగా వరద నీరు వస్తోంది. డ్యామ్‌లోకి ప్రస్తుతం 3.472 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురుస్తు న్న వర్షాల వల్ల ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 9.905 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 15.881 టీఎంసీ ల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 475 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుత జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 3.550 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఇప్పటి వరకు వివిధ అవసరాల నిమిత్తం ప్రాజెక్టు నుంచి 1.164 టీఎంసీల నీరు వది లారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు సాగు నీరు విడుదల చేసే ప్రణాళికను అధికారులు ఇంకా ఖరారు చేయ లేదు. రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థాయి అధికారులు సాగు నీటి విడుదల ప్రణాళిక ప్రకటించాల్సి ఉంటుంది.

శ్రీరాంసాగర్ ఆయకట్టు ఇలా..

జిల్లాలో రెండు, మూడు మినహా దాదాపుగా అన్ని మండలాల్లో శ్రీరాం సాగర్ కాకతీయ కాలువ ఆయకట్టు పరిధిలో ఉంది. ఇబ్రహీం పట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల వంటి మండలాలకు ఎస్‌ఆర్‌ఎస్‌పీ వరద కాలువ ద్వారా సాగు నీరు అందిస్తారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు కింద జగిత్యాల జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1.60 లక్షలు, ఆదిలాబాద్‌లో 1.45 లక్షలు, కరీంనగర్ 6.72 లక్షలు, వరంగల్ 4.71 లక్షలు, ఖమ్మం 1.28 లక్షలు, నల్లగొండ 2.87 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 3.05 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో వరి దాదాపు 2 లక్షల ఎక రాలకు పైగా సాగు అవుతుందని వ్య వసాయ అధికారులు అంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. వ్యవసాయ బావులు, అక్కడక్కడ చెరువులు, కుంటల్లో గల నీటి ఆధారంగా సాగు చేస్తున్నారు.

నేడు తెరుచుకోనున్న బాబ్లీ గేట్లు...

మహారాష్ట్రలో గోదావరి నదిపై గల బాబ్లీ ప్రాజెక్టు జూలై ఒకట వ తేదీన గేట్లు తెరుచుకుంటాయి. బాబ్లీ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదలనున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో గోదా వరి నదిపై మహారాష్ట్ర సర్కారు నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం జూలై 1వ తేదీ నుంచి ఎత్తి నీటిని ప్రతీ యేటా వదులుతారు. నాలుగు నెలల పాటు ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉంచి వచ్చిన నీరును వచ్చినట్లుగానే దిగువలోకి వదలనుండడంతో రానున్న రోజుల్లో ఎస్సారెస్పీలోకి మరింత నీరు వచ్చి చేరనుంది. అక్టోబర్ 28వ తేది వరకు బాబ్లీ గేట్లను ఎత్తి ఉంచనున్నారు.



జిల్లాలో పంటల సాగు అంచనా..



జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా వానాకాలంలో పంటల సాగు అవుతుందన్న అంచనాను అధికారులు వేశారు. జిల్లాలో పంటలు సాధారణ సాగు విస్తీర్ణం 3,35,978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,24, 425 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేశారు. ఇది సాధారణం కన్నా 88,447 ఎకరాలు అధికంగా ఉంది. ఇందులో ప్రధానంగా వరి 3,05, 000 ఎకరాలు, మొక్కజొన్న 41,000 ఎకరాలు, కందులు 2,500, పెసర్లు 150, ఇతర పప్పులు 675, సోయా చిక్కు డు 600, పత్తి 20,200, చెరుకు 1,200 ఎకరాలు, పసుపు 11,000, ఇతర పంటలు 42,100 ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. గత చివరి వానాకాలం సీజన్ లో జిల్లాలో 4,17,378 ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో గత యేడాది కంటే అధికంగా సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు.

ఇప్పటివరకు పంటలు వేసింది ముప్పది శాతమే...

జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాధారణ సాగులో కేవలం ముప్పది శాతం మాత్రమే రైతులు వివిధ పంటలు వేశారు. ఈ సీజన్‌లో వరి నాట్లు కేవలం 47 వేల ఎకరాల్లో మాత్రమే రైతులు వేశారు. అదే విధంగా మొక్కజొన్న 15,700 ఎకరాలు, కంది 12 ఎకరాలు, ఆవాలు 15 ఎకరాలు, పసుపు 2,957 ఎకరాలు, చెరుకు 354 ఎకరాల్లో ఇప్పటివరకు పంటలు వేసినట్లు అధికారులు గుర్తించారు. సకాలంలో వర్షాలు కురవక పోవడం, చెరువులు, కుంటలు, బావులు, బోరు బావు లలో నీటి మట్టాలు తగ్గడం, శ్రీరాంసాగర్‌లోకి వరద నీరు రాకపోవడంతో రైతులు నిరుత్సాహంతో ఉన్నారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం తక్కువగానే ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 187.0 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 151.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. సాధారణం కంటే 24.0 మిల్లీ మీటర్ల వర్షం ఎక్కువగా కురిసింది. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో పంటలు సాగుకు అవసరమైన నీరు అందేదెలా అన్న బెంగతో అన్నదాతలున్నారు.





అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కళ్యాణ్

కొండగట్టులో జనసేనాని

జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌కళ్యాణ్‌కు కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకులు, వేదపండితులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయంలో పలు శాఖల అధికారులతో పాటు నాయకులు పవన్‌తో సెల్ఫీలు దిగారు. - మల్యాల





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్



జనసేనానికి తలపాగా చుడుతున్న అర్చకుడు

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 29: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. జేష్ఠ బహుళ అష్టమి తోడు కావడంతో లక్ష్మీనరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆ లయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటు కున్నారు. రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశా రు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మం త్రోచ్ఛారణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు ని ర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యా వళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీని యర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు సింగారం గుట్టపై అస్థిపంజరం

- రెండు నెలల క్రితం చనిపోయినట్లు నిర్ధారణ
- మగ వ్యక్తి మృతదేహంగా గుర్తింపు

పెద్దపల్లి రూరల్, జూన్ 29: మండలంలోని సబ్బితం గ్రామ



అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి, వైద్యులు

పంచాయితి పరిధి గట్టుసింగారం గుట్టపై గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యమైంది. గ్రామానికి చెందిన మేకల కాపరులు మేకలను గట్టుసింగారం గుట్టపైకి మేపడానికి తీసుకెళ్లడంతో గుట్టపైన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి అస్థిపంజరం కనిపించింది. దీంతో సబ్బితం గ్రామపంచాయతీ కార్యదర్శికి రవికి సమాచారం అందించగా కార్యదర్శి బసంత్ నగర్ పోలీసులకు సమాచారం అందించడంతో పాటు ఫిర్యాదు చేశారు. దీంతో బసంత్ నగర్ ఎస్ఐ ఆర్.స్వామి, వైద్యులు సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పరిశీలించిన వైద్యులు సుమారు 25 నుండి 40 ఏళ్ల వయసు గల మగ వ్యక్తి ఆస్థిపంజరం అని , అతను చనిపోయి సుమారు రెండు నెలలు సమయం అయిందని పేర్కొన్నారు. సంఘటనపై అక్కడే పంచానామ నిర్వహించి , కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంసంత్‌నగర్ ఎస్ఐ ఆర్. స్వామి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

తంగళ్లపల్లి, జూన్ 29: తంగళ్లపల్లి మండ లం పద్మనగర్ గ్రామానికి చెందిన కొట్టాల గోవర్ధన్‌రెడ్డి (29) అనే యువకుడు అనుమా నాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... కొట్టాల లచ్చిరెడ్డి, ప్రమీల దంపతుల రెండో కుమారుడు కొట్టాల గోవర్ధన్‌రెడ్డి శుక్ర వారం రాత్రి రెండో అంతస్తులో ఉన్న బెడ్ రూమ్‌లో నిద్రించడానికి వెళ్లాడు. శనివారం ఉదయం 11 గంటలైనా నిద్రలేవకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా బెడ్ పైనుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గోవర్ధన్ (ఫైల్)

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 29: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీల లో పట్టుబడిన 28 మంది వాహనదారులను మంగళవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరో వ్యక్తికి ఏడు రోజులు, నలుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, మొత్తం 13,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 36 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

10న జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జూలై 29: టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో 8వ విడత జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను జూలై 10న ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని తెలిపారు.



అలనాటి కథ

మారిషస్ అనగానే అనేక జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. విశ్వవిఖ్యాతి చెందిన కవి టిఎస్ ఎలియట్‌కు స్వయంగా రాసిన లేఖను బహుమతిగా అందుకోవటం.. ప్రధానులు, రాణులు ఉన్న స్వీట్‌లలో స్టేట్ గెస్ట్‌గా ఉండటం..ఇలా అందమైన గత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తాయి.

మారిషస్‌లో మరపురాని సంఘటనలు!

తెలుగు లైబ్రరీ శంకుస్థాపన కోసం మారిషస్‌కు వెళ్లిన ఏడాది తర్వాత ఆ దేశ ప్రధాని నన్ను అక్కడ ఉన్న ఒక యూనివర్సిటీలో ప్రసంగించమని ఆహ్వానించారు. ఒక సారి మన దేశం తరఫున వెళ్లే.. మరో సారి ఆ దేశం ఆహ్వానంపై అక్కడికి వెళ్లటం మరచిపోలేని అనుభవమనే చెప్పాలి. నా కోసం ఎయిర్‌పోర్టుకు ప్రధాని సర్ శివసాగర్ రాంగులాం సెక్రటరీ విజయ్ ప్రత్యేకంగా వచ్చి.. నన్ను అక్కడ ఉన్న ప్రముఖ హోటల్ లి రిజ్వీకి తీసుకువెళ్లారు. అక్కడ నేను బస చేసిన స్వీట్‌లోనే ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ ఉన్నారని అక్కడ స్టాఫ్ చెప్పారు. ప్రపంచంలోనే పెద్ద పెద్ద డిగ్నిటరీలు ఉన్న స్వీట్‌ను నాకు కేటాయించటం చాలా ఆశ్చర్యమనిపించింది. ఆ రోజు రాత్రి మారిషస్ గవర్నర్ జనరల్ విలియం భార్య లేడీ విలియం నా రూమ్‌కు వచ్చి నన్ను రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ సమయానికి విలియం నేరుగా హోటల్‌కు వచ్చేశారు. ఆ డిన్నర్ చాలా బాగా సాగింది. ఆ మర్నాడు ఉదయం లేడి విలియం నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించారు. నేను సున్నితంగా తిరస్కరించాను. మర్నాడు విశ్వవిద్యాలయంలో నా ప్రసంగానికి కూడా మంచి స్పందన లభించింది.



ఈ సందర్భంలో మరో విషయం గురించి చెప్పాలి. మారిషస్‌లో మాల్కం అనే ప్రఖ్యాత రచయిత ఉండేవాడు. అతనిని మారిషస్ ప్రజలు తమ జాతీయ కవిగా భావించేవారు. నేను మారిషస్ వస్తున్నానని తెలిసి ఆయన నా గురించి ఒక వ్యాసం రాశారు. ఎవరి గురించి ఎక్కువగా పొగడని మాల్కం నా గురించి మాట్లాడటం ఒక సంచలనాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో- లేడి విలియం- మార్షల్‌ను కలవాలనుకుంది. నేను కూడా మార్షల్‌కు డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి- అందరినీ నా స్వీట్‌కు డిన్నర్‌కు పిలిచాను. ఆ విషయం చెబితే మార్షల్ డిన్నర్‌కు రాడు కాబట్టి- అతనికి లేడి విలియం వస్తున్నట్లు చెప్పలేదు. నేను పిలిచిన సమయానికి మార్షల్ వచ్చారు. మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత లేడి విలియంను కూడా వచ్చింది. వారిద్దరికీ పరిచయం చేశారు. లేడి విలియం అనేక విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ మార్షల్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కవులు, కళాకారుల మూడ్స్‌ను ముందుగా గుర్తించటం చాలా కష్టమని మరో సారి నాకు అర్థమయింది.

ఈ పర్యటనలో మరో ఆసక్తికరమైన సంఘటన కూడా జరిగింది. మారిషస్ ప్రధాని కార్యదర్శి విజయ్ నేను ఎక్కడికి వెళ్లినా నాతో పాటే ఉండేవారు. ఒక రోజు హఠాత్తుగా విజయ్‌కు- ఫ్రాన్స్ ప్రధాని మిత్రో మారిషస్‌కు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వస్తున్నారని.. ఆయనకు వెళ్లి స్వాగతం చెప్పమని ఫోన్ వచ్చింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో విజయ్ నన్ను కూడా ఎయిర్‌పోర్టుకు రమ్మని పిలిచాడు. నేను కూడా అతనితో పాటుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. మిత్రో విమానం ల్యాండ్ అయింది. మిత్రోకు మేము బోకేలు అందించాం. మిత్రోను ప్రసన్నం చేసుకుందుకు విజయ్ రకరకాల విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు. మిత్రో చిన్నప్పుడు రాసిన ఒక కవితను ఇంగ్లీషులో చదివి వినిపించాడు. మిత్రో మొహంలో ఎటువంటి భావాలు కనబడలేదు. "ఇది నా ప్రైవేట్ విజిట్.. ఎటువంటి ప్రొటోకాల్ అవసరం లేదు.. నేను ఒక హోటల్‌లో



ఉంటా" అని విజయ్‌ని కసురుకున్నాడు. ఫ్రాన్స్ ప్రధాని కావాలన్నా.. వద్దన్నా.. ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వాల్సిన బాధ్యత మారిషస్ ఉంది. దీంతో విజయ్ - "మీరు ఎక్కడికి వెళ్తాం అక్కడికే వెళ్దాం" అన్నాడు. మేమందరం మిత్రో ముందుగా బుక్ చేసుకున్న ఒక హోటల్‌కు వెళ్లాం. అక్కడ విజయ్‌ను వదిలేసి నేను నా హోటల్‌కు వచ్చేసా! మిత్రో హోటల్‌లో చెకిన్ అయిన తర్వాత 48 గంటల దాకా బయటకే రాలేదట! ఆ తర్వాత బయటకు వచ్చి బీచ్‌లో వ్యాహ్యాళికి వెళ్దామని పిలిచాడట. అక్కడ ఆయన విజయ్‌కు పెట్టిన ఏకైక కండిషన్- "నాకు ఏ ఆహారం పెడతారో.. అదే ఆహారం నా కుక్కకు కూడా పెట్టాలి.. నాకు ఎలాంటి గౌరవం ఇస్తారో.. అలాంటి గౌరవమే నా కుక్కకు ఇవ్వాలి" అని!

ఇలాంటి చిత్రమైన సంఘటనల మధ్య నా మారిషస్ పర్యటన ముగిసింది. నేను భారత్‌కు వచ్చేసే ముందు- ప్రధాని రాంగులాంను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో ఆయన నాకు ఒక అమూల్యమైన బహుమతి ఇచ్చారు. అదే విశ్వవిఖ్యాత కవి టిఎస్ ఎలియట్ స్వయంగా రాసిన ఒక లేఖ! దానిని ఆయన ఒక వేలంపాటలో కొన్నారట. "ఇది మీ దగ్గర ఉంటే బావుంటుంది" అని ఆయన బహూకరించారు. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా ఇప్పుడు ఆ లేఖ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కొన్ని కోట్లు ఉంటుందేమో?

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్





తెలుగు సినీ చరిత్రలో వైజయంతి మూవీస్ బ్యానర్‌కు, దాని అధినేత అశ్వనీదత్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఏళ్ల చలన చిత్ర ప్రస్థానం కలిగిన ఈ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రికార్డులు సృష్టిస్తోంది. "ఈ బ్యానర్‌లో నా తొలి సినిమాకు అయిన ఖర్చు 15 లక్షలు. కల్కికి అయిన ఖర్చు సుమారు 700 కోట్లు. 500 రెట్లు ఎక్కువ. నన్ను, నా కుటుంబాన్ని, మా బ్యానర్‌ను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం?" అంటారు అశ్వనీదత్. 'కల్కి' విజయోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో- ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

తెలుగు సినిమాగతిని 'కల్కి' మార్చేసింది..!

ప్రపంచవ్యాప్తంగా 'కల్కి' సాధించిన విజయం మీకు ఎలా అనిపిస్తోంది?

దీని కోసమే 50 ఏళ్ల వేచి చూశామేమో అనిపిస్తోంది. మూడేళ్ల క్రితం 'కల్కి' షూటింగ్ ప్రారంభించాం. ఏ విషయంలోను ఎప్పుడూ తొందరపడలేదు. రాజీపడలేదు. 'కల్కి-2'కు సంబంధించి కూడా సుమారు నాలుగు వేల అడుగుల ఫిల్మ్ షూట్ చేశాం. మిగిలింది పూర్తి కావాలి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం.

సినిమా ప్రపంచంలో జయాపజయాలు ఎప్పుడూ ఉంటాయి.. అపజయాలు ఎదురయినప్పుడు సినిమాల నుంచి విరమిద్దామని ఎప్పుడూ అనుకోలేదా?

ఒక్కసారి కూడా అనుకోలేదు. నాకు 22 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు సినిమా తీస్తానని గ్రేట్ ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లా. అప్పుడు ఆయన- "నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేసుకోవచ్చు కదా! ఇక్కడ ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.. నేనే ప్రస్తుతం కొన్ని రోజులు ఖాళీగా ఉంటున్నాను" అన్నారు. కానీ నేను సినిమా తీస్తానని పట్టుపట్టాను. సినిమా తీశాను. ఆ రోజు నుంచి జయాపజయాలు ఎన్నో చూశా. 'శక్తి' లాంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయాల్లో కూడా 'ఇదొక పీడకల. వెళ్లిపోతుంది' అనుకొనేవాణ్ణి.

మీకు ఇంత ఆత్మనిబ్బరం ఎక్కడి నుంచి వచ్చింది?

మా అమ్మ దగ్గర నుంచి వచ్చింది. నేను సినిమా రంగంలోకి వెళ్లటం మా నాన్నకు ఇష్టం లేదు. నేను అమ్మ దగ్గరకు వెళ్లి చెప్పాను చాలా గొడవ చేశాను ఆ సమయంలో నాకు మా అమ్మ పూర్తిగా మద్దతు ఇచ్చింది. వెన్నంటి నిలిచింది. నాన్నతో పోరాడింది. పట్టుదలగా నన్ను మద్రాసుకు పంపించింది. నా సక్సెస్‌ను తను కళ్లారా చూసింది. అందుకే మా అమ్మకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

ఇంత పెద్ద బడ్జెట్‌తో 'కల్కి' ఎలా తీయగలిగారు?

'కల్కి'లాంటి సినిమాను తీయగలగటం కారణం- మా అమ్మాయిలు- స్వప్న, ప్రియాంక. వాళ్లిద్దరు అమెరికాలో చదువుకొని వచ్చారు. ఆ సమయంలో వాళ్లతో ఏదైనా ఒక పరిశ్రమ పెట్టించాలనుకున్నా. కానీ వాళ్లు సినిమా రంగంలోకి రావాలనుకున్నారు. స్వప్న ముందు చిన్న వీడియో చిత్రాలు తీసేది. ప్రియాంక వచ్చిన తర్వాత- ఇద్దరూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాళ్లకు కొన్ని ఫెయిల్యూర్స్ వచ్చాయి. వాళ్లు వాటిని తట్టుకొని నిలబడగలిగారు. ఆ తర్వాత మానసికంగా, శారీరకంగా చాలా కష్టపడి 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా తీశారు. అదొక టర్నింగ్ పాయింట్.

'ఎవడే సుబ్రమణ్యం' - ఒక భిన్నమైన సినిమా. దాని కథ చెప్పినప్పుడు మీరేమన్నారు?

నాకు వాళ్ల మీద నమ్మకం ఉండేది. కానీ అదొక భిన్నమైన సినిమా. ఆ కథ చెప్పినప్పుడు- "కథ డిఫరెంట్‌గా ఉంది. బావుంది.. తీయండి.. అనుభవం వస్తుంది కదా..." అన్నాను. కానీ ఆ సినిమా తీస్తే రిస్క్ ఉంటుందనే విషయం నాకు తెలుసు. వాళ్లకు అనుభవం వస్తే చాలనుకున్నాను. కానీ ఆ సినిమా చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆ తర్వాత వాళ్లు చాలా నేర్చుకున్నారు. ఆ సినిమా తర్వాత 'మహానటి' తీశారు. ఆ సమయంలో నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే సావిత్రి గారు నాకు బాగా తెలుసు. అలాంటి గొప్ప నటి మీద చిత్రం తీయటం అంత సులభం కాదు. 'నేను ఇలాంటి స్టోరీ చేయలేకపోయాను. పిల్లలు చేస్తున్నారు' అనుకొనేవాణ్ణి.. బడ్జెట్ ఎక్కువయింది. పట్టించుకోవద్దని వాళ్లకు ధైర్యం చెప్పా. ఆ సినిమా కాపీ చూసిన తర్వాత మతి పోయింది. అంత గొప్పగా ఉందా సినిమా! ఆ తర్వాత 'జాతి రత్నాలు' పెద్ద హిట్. ఇలా వాళ్లకు సక్సెస్ అనేది ఒక్క రోజులో రాలేదు. ఒకో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పుడు శిఖరాన నిలబడ్డారు.

ప్రథమ కోపం

నేను బయట ఎక్కువగా ఎమోషన్స్ ప్రదర్శించను. అందరూ నా వాళ్లే కదా! బాధపడే అవకాశం ఉంటుంది. అయితే నాకు ప్రథమ కోపం ఎక్కువ. స్వప్నకు కూడా నా పోలికే ఎక్కువ వచ్చింది. తనకి కూడా నాలాగే షార్ట్ టెంపర్. కానీ వెంటనే సర్దుకుంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. స్వప్న, ప్రియాంక- ఇద్దరూ ఒకే మాట మీద ఉంటారు. వారి అభిప్రాయాలు వేరుగా ఉండచ్చు. ఆలోచనా విధానం మాత్రం ఒకటే!

మీ సమయానికి, ఇప్పటికీ సినిమా నిర్మాణంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

మా రోజుల్లో హీరో ఇమేజ్ ఆధారంగా కథలను రూపొందించుకొనేవాళ్లం. హీరోలకు చెబితే వెంటనే ఒప్పుకొనేవారు. ప్రస్తుతం ఉన్నన్ని డిస్కషన్స్ ఉండేవి కావు. ప్రస్తుతం సినిమా నిర్మాణ ప్రక్రియ చాలా స్లో అయింది. అన్నీ జాగ్రత్తగా చూసుకొన్న తర్వాత మొదలుపెడుతున్నారు. అవుట్‌పుట్ కూడా అంత గొప్పగానూ వస్తోంది.



మీరు అనేక మంది హీరోలతో సినిమాలు తీసారు కదా.. వారిలో ఉన్న గొప్ప గుణాలేమిటి?

నా సినీ జీవితంలో బెస్ట్ టైమ్ చిరంజీవిగారి ఎంట్రీ తర్వాతే వచ్చిందని చెప్పాలి. 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'తో ఆయనతో ప్రారంభమయిన ప్రస్థానం మరో మూడు సినిమాల వరకూ సాగింది. ఎక్కడా చిన్న పొరపొచ్చాలు కూడా రాలేదు. మహానుభావుడని చెప్పాలి. ఆ తర్వాత నాగార్జునగారితో ఐదు సినిమాలు చేశాను. చాలా మంచి మనిషి. ఇక కృష్ణగారి గురించి చెప్పక్కర లేదు. గొప్ప వ్యక్తి. 'అగ్నిపర్వతం' సినిమా తీస్తున్నప్పుడు ఆయన అనేక సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభాస్‌తో చేశా! తనకు కథ చెప్పినప్పుడు - "ఇది నా కోసం రాసిన కథ. నేను చేసి తీరతాను" అని మూడేళ్లు అన్నీ పక్కన పెట్టి సినిమాలో నటించాడు. విపరీతమైన సహకారం అందించాడు. మూడేళ్ల పాటు అతనికి ఈ సినిమా తప్ప వేరే ఆలోచనే లేదు. నేను చేసిన హీరోలందరూ నిర్మాత చల్లగా ఉండాలను కొనేవారే! మంచి సహకారం అందించిన వారే!

మీరు అనేక మంది దర్శకులతో పనిచేశారు. ఏ దర్శకుడితో నాగిని పోలుస్తారు?


నాగిపై ఏ దర్శకుడి ప్రభావం ఉన్నట్లు కానీ, పోల్చగలిగినట్లు కానీ నాకు అనిపించలేదు. తను ఏది అనుకున్నాడో అదే తీశాడు. ఎక్కడా ఎక్కువా లేదు, తక్కువా లేదు. ఒక సీను చూసి- 'దీన్ని ఇంకా బాగా తీయవచ్చు' అని నాకు ఎక్కడా అనిపించలేదు. గ్రాఫిక్స్ విషయంలో తను పడిన శ్రమ అసామాన్యం. తనకు ఇసుమంత గర్వం కూడా లేదు. 'మహానటి' సినిమాలో తన విశ్వరూపం చూపించాడు. అప్పుడు 'భగవంతుడు నాకు అలాంటి అల్లుణ్ణి ఇచ్చాడు చాలు...ఎంత కాలమైనా సినిమాలు తీస్తూనే ఉంటా' అనుకున్నా. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు సినిమాను వేరే స్థాయికి తీసుకువెళ్లాడు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

సమయం గడిచిపోయింది..

నా ఉద్దేశంలో తెలుగు సినిమా గతిని 'కల్కి' మార్చేసింది. మన దేశంలో వచ్చిన గ్రేటెస్ట్ ఫిల్మ్స్‌లో ఇది కూడా ఒకటి. ఇలాంటి సినిమా తీస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత మూడేళ్లు ఆడుతూ పాడుతూనే సెట్స్‌కు వెళ్లేవాడిని. 'వాళ్లు ఒక మహాయజ్ఞం చేస్తున్నారు. దానికి సమిధలు సమకూర్చటమే నేను చేయాల్సింది' అనుకున్నా! ఆ యజ్ఞ ఫలితం చూస్తుంటే విపరీతమైన ఆనందం కలుగుతోంది. పిల్లలను చూస్తుంటే- సినిమా తీసే విధానం నాకు కూడా తెలియదేమోననిపిస్తోంది. అమితాబ్, దీపిక, కమల్‌హాసన్, ప్రభాస్.. ఇలా దేశంలోనే అతి పెద్ద స్టార్స్ అందరినీ తీసుకువచ్చి సినిమా తీయటం అంత సులభం కాదు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు!




సినిమా తీయటానికి వెళ్లినప్పుడు- ఎన్టీఆర్- "బ్యానర్‌కు ఏం పేరు పెట్టావు?" అని అడిగారు. "మీరు ఏ పేరు చెబితే ఆ పేరు పెడతా.." అన్నా. ఆయన అక్కడ ఉన్న కృష్ణుడి పటం వైపు చూశారు. "కృష్ణుడు మనకు అచ్చొచ్చిన దైవం కదా... 'వైజయంతి మూవీస్' అని పెట్టు.." అని ఒక కాగితంపై రాసి ఇచ్చారు. అలా ఆ మహానుభావుడితో పేరు పెట్టించుకొనే అదృష్టం దక్కింది.

ఎలా గుర్తుండాలంటే...



తెలుగు సమాజాన్ని, ప్రజలను అర్థం చేసుకొని... వాళ్ల అభిరుచులను గమనిస్తూ.. వాళ్ల అంచనాలకు మించిన గొప్ప సినిమాలు తీసే నిర్మాతగా నన్ను చరిత్ర గుర్తుపెట్టు కోవాలనుకుంటున్నా!

కల్కి- పార్ట్ 2



'కల్కి'ని మొదట రెండు భాగాలుగా తీద్దామని అనుకోలేదు. షూటింగ్ కొంత అయిన తర్వాత అనుకున్నారు. "కమల్‌హాసన్ క్యారెక్టర్ రెండో పార్ట్‌లోనే ఎలివేట్ అవుతుంది. దాని మీద ఎక్కువ వర్క్ చేద్దామనుకుంటున్నా" అని నాగీ చెప్పాడు. 'కల్కి' మొదటి పార్ట్ సూపర్ హిట్ అయింది. రెండోది కూడా మొదటి పార్ట్ కన్నా ఎక్కువ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అమితాబ్, ప్రభాస్, కమల్ ముగ్గురు కలిసే సీన్స్ చాలా గొప్పగా ఉంటాయనిపిస్తుంది.

ఈ ముంబై భామ టీవీ నటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత వెండితెరకొచ్చింది. పేరు నుస్రత్ భరూచా. 'రామ్‌సేతు', 'ఛత్రపతి' లాంటి హిందీ చిత్రాలతో పాపులరైన నుస్రుత్ భరూచా గురించి కొన్ని విశేషాలు...

అందుకే... కెరీర్‌లో నిలబడాలనుకున్నా..!

నుస్రత్ భరూచాకు ఇన్‌స్టాలో ఏడు మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. తన ఇంట్లో ఫొటోలు, పెంపుడు జంతువులు, తినే ఆహారం, యాత్రా విశేషాలు, సినిమా కబుర్లు చెబుతుంటుంది. ఫొటోషూట్స్ అప్‌లోడ్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగా మరీ అంత పెద్ద హిట్లు లేకపోయినా.. ఆమెకు ఇన్‌స్టాలో మంచి ఫ్యాన్‌బేస్ ఉంది.

ఇంట్లో తెలీకుండా..

తన్వీర్, తస్నీమ్ దంపతులకు పుట్టిన గారాల పట్టి నుస్రత్. ముంబైలోనే పుట్టి పెరిగింది. అక్కడే విద్యాభ్యాసం. డిగ్రీ వరకు చదివింది. ఆ మధ్యలోనే సినిమా పిచ్చి పట్టుకుంది. సినిమాల్లోకి వెళ్తానంటే.. కుదరదన్నారు ఇంట్లో. దీంతో చేసేదేమీ లేక కొన్నాళ్లు ఊరుకుంది. ఆ తర్వాత ఇంటి దగ్గరనుంచి ఏదో కోర్సు చదవాలని వెళ్లి.. ఆడిషన్స్‌కు అటెండ్ అయ్యేది. అలా 'కిట్టీ పార్టీ' సీరియల్‌లో ఎంపికయింది. ఇంట్లో వాళ్లకు తెలీకుండా షూటింగ్‌లో పాల్గొంది. చివరికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. ఇదో కెరీర్ అని ఒప్పించింది. 2016లో 'జై సంతోషిమా' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది.

అంత సులువుగా సక్సెస్ కాలేదు..

నుస్రత్ అందం, అభినయం ఉన్నా ప్రతిభ మాత్రం తప్పదని గ్రహించింది. సీరియల్స్‌లో నటించిన అనుభవంతో సినిమాల్లో నటించింది. ఒక్క సినిమా కూడా వర్కవుట్ కాలేదు. హీరో శివాజీ సరసన 'తాజ్ మహల్(2010)లో నటించింది. ఓ తమిళ చిత్రంలో నటించింది. అయినా ఆమెకు అపజయాలే పలకరించాయి. 'ఎల్.ఎస్.డీ' చిత్రంతో నోటెడ్ అయ్యింది. అలాంటి సమయంలో 2011లో 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో ఆమెకు సక్సెస్ దక్కింది. 'ఆకాష్‌వాణి', 'ప్యార్ కా పంచనామా 2', 'డ్రీమ్ గాళ్', 'రామసేతు'.. లాంటి బాలీవుడ్ చిత్రాల్లోని ఆమె నటనకు చక్కటి గుర్తింపు వచ్చింది. గతేడాది 'ఛత్రపతి' హిందీ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ జోడీగా నటించింది. వాస్తవానికి ఇది ప్రభాస్ 'ఛత్రపతి'కి రీమేక్. ఈ సినిమాతో ఆమెకు క్రేజ్ వరించింది.




నేను నటించిన సినిమాను పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు.. బాగా గుర్తుంది! నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకో వాలనుకున్నా

మ్యూజిక్ వీడియోలతోనూ పాపులర్..

'చలాంగ్' చిత్రంలో రాజ్‌కుమార్. ఆర్ తో కలసి నటించింది. ఇందులో 'కేర్ కి నర్దా..' అనే ఓ పాట యూట్యూబ్‌లో రిలీజ్ అయినప్పుడు.. ముప్పయి కోట్లకు పైగా వీక్షించారు. యోయో హనీసింగ్‌తో చేసిన 'సయాన్ జీ..' పాటను యాభై కోట్లకు పైగా వీక్షించారు. దీంతో నస్రుత్‌కు యూత్‌లో మంచి ఆదరణ దక్కింది. 'ఆజీబ్ దాస్తా', 'తు జూతీ మే మక్కర్' లతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఆమె ఫేమ్ అయ్యింది. 'ఒకప్పుడు ఆడిషన్‌కు వెళితే.. సరిపోవు ఈ పాత్రకు అనేవాళ్లు. అవేమీ పట్టించుకోలేదు. సినిమాల్లో నటించటం మొదలెట్టాక.. ఓ చిత్రం పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవటమే కాదు కెరీర్‌లో నిలబడాలి అనుకున్నా' అంటుంది నుస్రత్. రెండేళ్ల కిత్రం వెర్టిగో సమస్యతో బాధపడింది. డ్యాన్స్ వేసేప్పుడు కిందపడి మోకాలి, వెన్ను సమస్య వచ్చింది. మానసికంగా బలాన్ని పుంజుకుంది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ఏడాది సమయం పట్టింది. ఆ సమయంలో జీవితం అంటే ఏంటో అర్థమైంది అంటుంది నస్రుత్ భరూచా.

పాదాల పగుళ్లు పోవాలంటే...

ఈ వానా కాలంలో కొందరికి, పాదాలు, మడమలు పగిలి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఎక్కువగా పగిలితే ఆ పగుళ్ల నుండి రక్త స్రావం అయ్యే అవకాశం కూడా ఉంటుంది. వర్షరుతువులో పాదాలు కొంచెం ఎక్కువ సేపు నీటిలో నానినా పగుళ్లబాధ తీవ్రం అవుతుంది.ఈ పగుళ్ల నివారణకు ఇంట్లోనే పాటించగల చిట్కాలను తెలుసుకుందాం,



బేకింగ్‌సోడాతో: ఒక బకెట్ లేదా టబ్‌లో గోరువెచ్చని నీరు తీసుకుని, అందులో మూడు స్పూన్ల బేకింగ్ సోడాకలిపి, ఆ నీటిలో పదిహేను నిమిషాల పాటు పాదాలను ఉంచి, తరువాత పొడి బట్టతో పాదాలను తుడిచి ప్యూమిస్ స్టోన్‌తో మృతచర్మ కణాలు తొలగిపోయేలా రుద్ది.. తరువాత కొబ్బరినూనెలో అలోవెరా జెల్ కలిపి రాయాలి.

బియ్యపుపిండితో: చర్మం మీది మృతకణాలు తొలగించడంలో బియ్యపుపిండి అద్భుతంగా పని చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో మూడు టేబుల్‌స్పూన్ల బియ్యపు పిండిని కలిపి, దానికి నాలుగు చుక్కల వెనిగర్ ను చేర్చి, ఆ మిశ్రమంతో పాదాలను పది నిమిషాల పాటు సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల మృతకణాలు తొలగిపోవడంతో పాటు, తేనె వల్ల చర్మం తేమగా మారుతుంది.

నిమ్మరసంతో: ఐదు స్పూన్ల సముద్రపు ఉప్పుకు ఒక స్పూను కొబ్బరినూనె ఒక చెంచా నిమ్మరసం కలిపిపాదాలకు రాసి, పదిహేను నిమిషాలు ఉంచి చల్లని నీటితో కడిగేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్‌తో: ఒక చెంచా తేనె, ఒక చెంచా బియ్యపు పిండికి, ఒక చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ చేర్చి ఈ మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి తరువాత గోరువెచ్చని నీటిలో కడిగేయాలి.

నువ్వుల నూనెతో: నువ్వుల నూనె, కొంత గ్లిజరిన్.. రెండు చెంచాల కాఫీ పొడిని చేర్చి, ఆ మిశ్రమంతో కూడా పాదాలకు మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఓట్‌మీల్‌తో: ఓట్‌మీల్, ఆలివ్ నూనె తేనె బియ్యపుపిండి కలిపిన మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఆశా కార్యకర్త బలవన్మరణం

కథలాపూర్, జూన్ 29 : ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నావని తరచూ భర్త అనుమానించడంతో మండలంలోని తాండ్ర్యాలకు చెందిన బాల్క రుచిత (35) అనే ఆశా కార్యకర్త ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...తాండ్ర్యాలలో రుచిత కొన్ని సంవత్స రాలుగా ఆశా కార్యకర్తగా పనిచేస్తోంది. భర్త విజయ్ భార్యపై ఫోన్‌లో మాట్లాడుతున్న క్రమంలో అనుమానం పెంచుకున్నాడు. దీంతో తరచుగా వేధింపులకు గురిచేస్తున్నాడని రుచిత తన కుటుంబ సభ్యులతో చెప్పుకునేది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురై రుచిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తల్లి ఎర్రక్క ఫిర్యాదు మేరకు శవాన్ని కేసు దర్యా ప్తు చేసున్నట్టు ఎస్సై తెలిపారు. రుచితతో సహా అక్కలు, తల్లిదండ్రులు వేధిం పులకు గురిచేశారని రుచిత వదినె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం వల్ల మనస్థాపానికి గురైందని స్థానికులు పేర్కొంటున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, జూన్, 29 : పారిశుధ్య పనులను నిత్యం చేపట్టాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోబడునని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లోని మురికి కాలువలను శుభ్రం చేయించారు. వార్డుల్లోని ఎపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి తరలింప జేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున పట్టణంలోని మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లపై చెత్త ఉండకుండా చూడాలని, రోడ్లపై నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలని, కాలనీల పరిసరాల పరిశుభ్రతను ప్రతి నిత్యం పాటించాలని సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, సిబ్బంది, పారిశుధ్య కార్మికలు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

జగిత్యాలరూరల్, జూన్ 29 : కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ శ్రీచైతన్య రెసిడెన్షియల్ హైస్కూల్‌లో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా హాస్టల్‌లోని ఆహారపదార్థాలను తనిఖీ చేసి కాలంచెల్లిన ఆహారపదా ర్థాలతో పాటుగా, నాసిరకం పాలప్యాకెట్, కిరాణవస్తువులు, పురుగులతో నిండిన బియ్యాన్ని గుర్తించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష తెలిపారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష మాట్లాడుతూ హాస్టల్ లో కాలంచెల్లిన, కుళ్లిన ఆహార పదార్థాలతోపాటుగా, నాణ్యతలేని, పురుగులుపట్టిన బియ్యాన్ని గుర్తించామని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బరువు, ఎత్తుల మేళా

రాయికల్, జూన్ 29: మండలంలోని వస్తాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బరువు, ఎత్తుల మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు బరువు, ఎత్తులు కొలిచి వారి స్థితిని తల్లులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి, ఇటిక్యాల సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి, పోషణ అభియాన్ బీసీ శ్రీధర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

రైతుబంధుపై ప్రత్యేక సర్వసభ్య సమావేశం

జగిత్యాలరూరల్, జూన్ 29 : జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో శనివారం రైతుబంధు పై ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని జిల్లా వ్యవసాయాధికారి వాణి, ప్యాక్స్ ఛైర్మన్ సందీప్‌రావు సమక్షంలో నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ గ్రామాల నుండి వచ్చినరైతుల నుండి రైతు భరోసా, వరిధాన్యానికి బోనస్ అనే అంశాలపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతుబంధు పథకాన్ని 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే వర్తించాలని రైతులు తీర్మానించారు. అలాగే అన్ని రకాల వరిధాన్యానికి రూ. 500 బోనస్ వర్తించాలని రైతులు తీర్మాణం చేశారు. ఈకార్యక్రమంలో ప్యాక్స్ సీఈవో శేఖర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రపంచ చెట్ల దినోత్సవం

రాయికల్, జూన్ 29: రాయికల్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ చెట్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీపతి రాఘవులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు రమేష్, రవీందర్, మల్లేశం, గంగజమున, సత్యనారాయణ, నాగరాజు, గంగాధర్, వనిత, శివానందం, యాస్మిన్ ఫాతిమా, పద్మజ, పీడీ గంగాధర్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

జగిత్యాల టౌన్, జూన్ 29 :ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. విధి నిర్వాహణలో అందరి మన్ననలు అందుకుని పదవీ విరమణ పొందుతున్న ఏఎస్సైలు చంద్రశేఖర్, కరుణాకర్, అంజయ్యల సన్మాన సభను శనివారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. పదవీ విరమణ పొందుతున్న అధికారుల సేవలను గుర్తించి శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అడిషనల్ ఎస్పీ భీంరావ్, డీఎస్పీ రఘు చందర్, ఆర్ఐ వేణు, ఆర్ఎస్సై కృష్ణ ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడి పదవీ విరమణ

కొడిమ్యాల, జూన్ 29 : మండలంలోని దమ్మయ్యపేట ప్రధానోపాధ్యాయుడు ఆరేటి వెంకటేశ్వర్లు శనివారం పదవీ విరమణ పొందారు. ప్రధానోపాధ్యాయున్ని ఎంఈవో అయిత శ్రీనివాస్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆరేటి వెంకటేశ్వర్లు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిర్మలాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జ్యోత్స్నాదేవి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రుబీనా, పలువురు ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాల మున్సిపాలిటీని .. అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలి

●ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

●మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

●యావర్ రోడ్డును వెడల్పు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం

జగిత్యాల టౌన్, జూన్ 29 : జగిత్యాల మున్సిపల్‌ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులతో పాటు పాలకవర్గ సభ్యులదేనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శనివారం చైర్ పర్సన్ అడువాల జ్యోతి అధ్యక్ష తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజెండాలో పొందుపరిచిన పలు అంశాలను సభ్యులు ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్సీ దృష్టికి పట్టణ సమస్యలను, చేపట్టాల్సిన పలు అభివృద్ధి తదితర అంశాలను తీసుకువెళ్లిన సభ్యులు రెండు గంటలకు పైగా చర్చించారు. యావర్ రోడ్డును పూర్తి స్థాయిలో 100 ఫీట్ల విస్తరణ చేసే విధంగా సభ్యులు చర్చించి అదనపు ఎజెండాలో పొందుపరిచి ఆమోదించారు. యావర్ రోడ్డు వెడల్పుకు కావలసిన నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరుకు కృషి చేయాలని సభ్యులు ఎమ్మెల్సీని కోరగా సీఎం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఇటీవల జగిత్యాల మున్సిపల్ పరిధిలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన ముగ్గురు మాజీ కౌన్సిలర్ల మృతి పట్ల సంతాపం తెలియజేశారు. పదవీ విరమణ పొందిన పారిశుధ్య కార్మికుడు తోట గంగారాంను శాలువాలతో ఎమ్మెల్సీ, చైర్ పర్సన్, కౌన్సిలర్లు సన్మానించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం చైర్ పర్సన్ సమావేశ మందిరంలో జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. యావర్ రోడ్డు వెడల్పుకు సుమారు రూజ 70 కోట్ల నిధులు అవసరం ఉంటాయన్నారు. నిధుల కోసం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందించి మంజూరుకు కృషి చేస్తానన్నారు. అమృత్ స్కీం కింద రూ. 28 కోట్ల నిధులతో ఇంటింటికి మంచినీరు అందించే పనుల కోసం టెండర్ ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పట్టణంలో మూడు చోట్ల వాటర్ ట్యాంక్ హెడ్‌ల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ దుర్గయ్య ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

మున్సిపల్‌లో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి

జగిత్యాల మున్సిపల్‌లో మాస్టర్ అమలు చేయడంతో పాటు యావర్ రోడ్డును 100 ఫీట్ల మేర విస్తరణ చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి శనివారం కలెక్టర్ ద్వారా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగిత్యాల మున్సిపాలిటీలో మస్టార్ ప్లాన్ అమలులో గత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలోనే యావర్ రోడ్డు వెడల్పు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపినప్పటికి కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 2018 శాసన సభ ఎన్నికల్లో యావర్ రోడ్ అంశాన్ని తెరమీదికి టీఆర్ఎస్ పేరుతో తెరమీదికి తెచ్చి ఐదేళ్ల పాటు విస్తరణ పనులు నాన్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాస్టర్ ప్లాన్ అమలు చేసి ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చాల్సిన బాధ్యత మన ప్రభుత్వం ఎంతగానో ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో జగిత్యాల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు విస్తరణలో ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం చెల్లింపు కోసం రూ. 100 కోట్ల అంచనాలు రూపొందించారన్నారు. మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు విస్తర పనులకు కావలిసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ నుంచి మంజూరు ఇప్పించాలని కలెక్టర్ ద్వారా సీఎంను కోరినట్లు ఎమ్మెల్సీ వివరించారు.

డీఎస్ మృతితో కోరుట్లలో విషాదం

కోరుట్ల, జూన్ 29 : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యులు ధర్మపురి శ్రీనివాస్ మృతితో కోరుట్లతో పాటు మెట్‌పల్లిలో విషాదం అలుముకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షత పదవితో పాటు నిజామాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న సమ యంలో డీ శ్రీనివాస్‌కు కోరుట్ల పట్టణంతో ఎనలేని రాజకీయ అనుబంధం ఉండేది. కోరుట్ల పట్టణం డీఎస్ అత్తగారి ఊరు అయినా కూడా రాజకీయంగా ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నారు. రత్నాకర్‌రావు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో కోరుట్ల పట్టణంలో రత్నాకర్‌రావును ఒప్పించి తనకు సంబంధించిన వ్యక్తిని మున్సిపల్ చైర్మన్ పదివిలో కూర్చోబెట్టడానికి పావులు కదిపింది డీఎస్. దీంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న జగిత్యాల కోరుట్ల నియోజవర్గాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పీసీసీ అధ్యక్షుడుగా డీఎస్ ఎంతో కృషి చేసినట్లు అప్పటి కాంగ్రెస్ నాయకులు గుర్తు చేసుకుంటున్నారు. పలు పదవులలో కొన సాగిన సందర్భాలలో డీఎస్ కోరుట్ల పట్టణానికి విచ్చేసిన సందర్భాల్లో వారి కుల సంఘ సభ్యులు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికిన సందర్భాలున్నాయి. దీనికి తోడు ఇప్పుడు ప్రస్తుతం దర్మపురి శ్రీనివాస్ తనయుడు అర్వింద్ నిజామాబాదు ఎంపీగా కొనసాగుతండంతో ఆ కుటుంబానికి కోరుట్లకు విడదీయలేని అనుబంధం ఏర్పడినట్లు అయింది.

●రాజ్యసభ్యుడు మాజీ పీసీసీ అధ్యక్షుడు, నిజామాబాదు మాజీ ఎమ్మెల్యే ధర్మపురి శ్రీనివాస్ మృతితో కోరుట్లలో విషాదం నింపింది. కోరుట్ల పట్టణంలోని గడిగుర్జు ప్రాంతంలో నివాసం ఉండే రేగుల రాజరాం- గర్జిల గంగవ్వకు ముగ్గురు కూతుర్లు ఇద్దరు కొడుకులున్నారు. ఈ దంపతుల చిన్న కూతురు విజయ లక్ష్మితో దర్మపురి శ్రీనివాస్‌కు వివాహం జరిగింది. దర్మపురి శ్రీనివాస్ మృతితో కోరుట్ల పట్టణంలో విషాదం నింపింది. బీజేపీ నాయకులు భారీ సంఖ్యంలో నిజామాబాద్‌కు తరలివెళ్లి అర్వింద్‌ను కలిసి పరామర్శించారు. శ్రీనివాస్‌కు నివాళులు అర్పించనున్నారు.

జగిత్యాల టౌన్ :నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి రాజకీయాలు చేసిన వ్యక్తి ధర్మపురి శ్రీనివాస్ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు పే ర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఉమ్మడి రాష్ట్ర పీసీసీ మాజీ అధ్యక్షుడు దర్మపురి శ్రీనివాస్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మెట్‌పల్లి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జోతక్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొమిరెడ్డి కరంచంద్, విజయ్‌ఆజాద్ అన్నారు. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ శనివారం తెల్లవారు జామున మృతి చెందడంతో సంతాపం తెలిపారు.



తండ్రి డీఎస్ భౌతికకాయం వద్ద ఎంపీ అర్వింద్

రైతుల సహకారంతోనే సహకార సంఘాల మనుగడ

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి వాణి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి వాణి

జగిత్యాల అర్బన్, జూన్ 29: రైతుల సహకారంతోనే సహకార సంఘాల మనుగడ, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి బి.వాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీట్‌బజార్ సమీపంలో గల జగిత్యాల వ్యవసాయ సహకార సంఘ ప్రత్యేక సాధారణ సమావేశం శనివారం ప్యాక్స్ చైర్మెన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఏవో వాణి మాట్లాడుతూ రైతులకు అన్ని రకాల రుణ సదుపాయం కల్పిస్తూ పీఏసీఎస్‌లు చేయూతను అందిస్తున్నాయన్నారు. తీసుకున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని తిరిగి వాటిని చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పడా లన్నారు. అనంతరం పీఏసీఎస్ చైర్మెన్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పొందే పెట్టుబడి సాయం కనీసం పదెకరాల వరకు పంటలు సాగయ్యే భూములకు ఇవ్వా లని, అలాగే సన్నరకాలకు మాత్రమే కాకుండా అన్ని రకాలైన సన్న, దొడ్డు వరిధా న్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మెన్ శీలం సురేందర్, సీఈవో గాజెంగి వేణు, డైరెక్టర్‌లు అల్లాల రమేష్ రావు, తోట గంగారాజం, బేతి రాజవ్వ, నీలం లక్ష్మీ, ముప్పారపు దేవమ్మ, ఆరుముల్ల గంగారాం, తో పాటు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల పాట్లు

మల్యాల, జూన్ 29: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులు శనివారం ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్ పర్యటనతో అసౌకర్యానికి గురి అయ్యారు. ప్రతి శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో పవన్ వచ్చాక భక్తుల దర్శనాలు నిలిపి వేశారు. దీంతో దాదాపుగా అరగంట సేపు బయట క్యూలైన్‌లలోనే ఉన్నారు. అయన రాకముందు కూడా భక్తులను నియంత్రించడంతో ఇబ్బందులు పడ్డారు. అలాగే ఆలయంలో నిత్యం సమర్పించే ఆరగింపు ఆలస్యం కాగ ఆరగింపు సమయంలోనే కళ్యాన్ రావడంతో త్వరగా పూర్తి చేయడం పట్ల అక్కడ ఉన్న పలువురు అసహనం వ్యక్తం చేశారు

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

మెట్‌పల్లి, జూన్, 29 : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మెట్‌పల్లి డిపోలో విధులు నిర్వహించిన ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లను మేనేజర్ వేదావతి సన్మానించారు. శనివారం పట్టణంలోని డిపోలే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవి విరమణ చేసిన డిప్యూటీ సూపర్‌డెంట్ గట్ల రమేష్, కండక్టర్లు రాఘేందర్, శంకరయ్య, డ్రైవర్ వేంకటేశంలను పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ పదవి విరమణ పొందిన వారు సుదీర్ఘ కాలం పాటు ఆర్టీసీకి అద్భుతమైన సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు శ్రీనివాస్, రాజారం, నాగయ్య, నాగేష్, రాఘవ, మహేష్, శేఖర్‌ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డిప్యూటి డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్

మల్యాల, జూన్ 29: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటి డీఎం హెచ్‌వో ఎన్.శ్రీనివాస్ అన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని తక్కళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, నీళ్ల నిలువకుండా చూసుకోవడం ద్వారా మలేరియా, డెంగ్యూ, భోధకాలు, చికెన్‌గున్య రాకుండా నివారిం చుకో వచ్చుచని తెలిపారు. వేడి అన్నం తినాలని లేకుంటే టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యు రాలు మౌనిక, ఎన్‌సీడీ సూపర్‌వైజర్ మురళీ, శ్రీధర్, వంశీ పాల్గొన్నారు



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్

జగిత్యాలరూరల్ : సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను శనివారం సందర్శించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస గృహాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దోమల వల్ల సంభవించు మలేరియా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధులు, దోమల నియంత్రణకు చేపట్టే చర్యలను వివరించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోసి నీటితొట్లలను, పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

వార్డుల అభివృద్ధి నిధులకు ఆమోదం

కోరుట్ల మున్సిపల్ అత్యవసర సమావేశం

కోరుట్ల, జూన్ 29 : పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి నిధుల మంజూ రుకు కౌన్సిల్ సభ్యులు ఎకగ్రీవ తీర్మానంతో ఆమోదం తెలిపారు. శనివారం మున్సిపల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన జరుగగా 34 అశాంలతో కూడిన ఎజెండాను అధికారులు కౌన్సిల్ సభ్యుల ముందు ఉంచగా వారు ఎకగ్రీవ తీర్మానం ద్వార ఆమోదం తెలిపారు. వర్షాకాలం దృష్టా వార్డులలో రోడ్లపై గుంతలను మురంతో నిపడానికి రూ. 5 లక్షలు, నూతన విద్యుత్ స్థంబాల ఏర్పాటు చేయడానికి రూ. 5 లక్షలు, సానిటేషన్ నిర్వహనకు రూ. 10 లక్షలు, అన్ని వార్డులలో మురికి కాల్వలపై షాబ్ నిర్మాణాలకు రూ. 15 లక్షల నిధు నిధులు మంజూరికి పాలక వర్గ సభ్యులు ఎకగ్రీవం ద్వార ఆమోదం తెలిపారు. సమావేశం చివరలో వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్లు వార్డు సమస్యలను సభా దృష్టికి తీసుపోయి చైర్‌పర్సన్‌ను సమాధానం చెప్పాలని పట్టుపట్టగా చైర్ పర్సన్ అన్నం లావణ్య సమావేశం ముగిసిందని వెళ్లిపోవడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ తిరుపతి కలగజేసుకుని సమస్యలను పరిష్క రిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, ఏఈ లక్ష్మి, టీపీఓ ప్రవీణ్ కుమార్, టీపీఎస్ రమ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, వార్డు కౌన్సిలర్, కో అప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

●ఉద్యోగ విరమణ పొందిన పారిశుధ్య జవాన్ గంగరాజంను మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో సన్మానించారు. కోరుట్ల మున్సిపల్‌లో 42 సంవత్సరాలు విధులు నిర్వహించిన గంగరాజం శనివారం పదవి విరమణ పొందారు. గంగారాజంను మున్సిపల్ సిబ్బంది, అధికారులు, వివిధ వార్డుల కౌన్సిలర్ల్ సన్మానించి అభినందించారు. అనంతరం గంగారాజంను మున్సిపల్ కమిషనర్ తనకు రావాల్సిన వేతనంతో పాటు ప్రభుత్వం నుంచి అందే లబ్దిని అందించాడు. కమిషనర్ కారులో గంగారాజంను తన ఇంటి వద్ద దించి కుటుంబ సభ్యులను అభినందించారు.



పారిశుధ్య కార్మికుడు గంగరాజంను సన్మానిస్తున్న మున్సిపల్ అధికారులు

సంక్షిప్త సమాచారం

మల్యాల: తెలుగు వెలుగు సాహితి వేదిక మహానంది జాతీయ పురస్కారాలకు మల్యాలకు చెందిన శ్రీభక్త మార్కండేయ నాటక కళామండలి సభ్యులు ఎంపికయ్యారు. ఈ నెల 30న కరీంనగర్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

కొడిమ్యాల : చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల అకాల మృతి చెందటంతో శనివారం హైదరాబాదులో ఎమ్మెల్యే సత్యంను కొడిమ్యాల బీఆర్ఎస్ నాయకులు, పరామర్శించారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా ఇల్లెందుల శ్రీనివాస్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలో లయన్స్ క్లబ్ కార్యవర్గ ఎన్నికలను సభ్యులు నిర్వహించారు. నూతన అధ్యక్షుడుగా ఇల్లెందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గుండా రాకేష్, కోశాధికారిగా నాంపల్లి వేణుగోపాల్, జోన్ చైర్మన్‌గా గడ్డం శంకరరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మల్యాల: మండలంలోని రామన్నపేటకు చెందిన ఏడల గంగయ్య(75)అనే వృద్ధుడు అనారోగ్యం భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వికలాంగుడు కూడా అయిన గంగయ్య కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను శనివారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై-2 కుమారస్వామి తెలిపారు.

కొడిమ్యాల: రైతు బందుపై కొడిమ్యాల, పూడూర్, తిర్మలాపూర్ సింగిల్ విండో ప్రత్యేక సర్వ సభ్య సమావేశాలు రైతు వేదిక భవనాలలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశాలకు మంచిర్యాల డీసీవో బి. రాంమొహన్ హాజరైనారు. ఉన్నత అధికారి సమక్షంలోనే నిర్వహించిన సమావేశాల్లో రైతు బందుపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. సమావేశాల్లో అసిస్టెంట్ రిజిస్టార్ మల్లేశం, అడాప్షన్ ఆఫీసర్ అశోక్‌కుమార్, సింగిల్ విండోల చైర్మనులు బండ రవీందర్‌రెడ్డి, పోలు రాజేందర్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మహిళాసంఘాల సభ్యులు నిర్వహిస్తున్న వివిధ మహిళశక్తి యూనిట్లను జిల్లా జడ్జి నీలిమ సోదరిమణులు లలితకుమారి, ధనలక్ష్మీ సందర్శించారు. గ్రామీణ మహిళలు మంచి ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు.

మల్యాల: కొండగట్టులో పవన్‌కళ్యాన్ పర్యటనలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. వేలాదిగా అభిమానులు తరలిరావడంతో కొందరి డబ్బులు, బంగారు గొలుసులు, పర్సులు కొందరు దొంగిలించారు. పర్సులలో బ్యాంకుల కార్డులు కూడా చోరీకి గురి కావడంతో బాదితులు ఆందోళన వ్యక్తం చేశారు.

●కొండగట్టు ఘాట్‌రోడ్డుకిరువైపులా హుస్నాబాద్‌కు చెందిన సామాజిక సేవకుడు సత్యనారాయణ వ్యక్తి శనివారం 500 మొక్కలు నాటాడు. సొంత ఖర్చులతో గతంలోనూ కరీంనగర్ తదితర చోట్ల 70వేల మొక్కలు నాటినట్లు సత్యనారాయణ ఈ సందర్భంగా తెలిపాడు.

వెల్గటూర్: మండలంలోని పైడిపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ గంగుల నరేష్ తండ్రి గంగుల సత్తయ్య ఇటీవల మృతి చెందగా శనివారం ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. సత్తయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంగుల అశోక్, గంగుల నరేష్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, నాయకులు స్వామి, కొప్పుల సురేష్, సత్యం పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ శివారులో గల కొదురుపాక శ్రీనివాస్, కొదురుపాక సంతోష్‌కు చెందిన వ్యవసాయ భూమిలో గల అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక ట్రిప్పులకు జూలై 2న వేలం పాట వేస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మచెట్టు వద్ద ఉన్న 120 ట్రాక్టరు ట్రిప్పులు, జిల్లేడు చెట్టు వద్ద ఉన్న 50 ట్రాక్టర్ల ట్రిప్పులు, గోదావరి నది ఒడ్డున 70 ట్రాక్టర్ ట్రిప్పులు (1173.06 ఎంటీ) ఇసుకను మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించి సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగి ఉన్న వ్యక్తులు సమయానికి 11,30 గంటలకు వచ్చి ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

కథలాపూర్ : వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో రోగాలు విజృంభించే అవకాశం ఉన్నందు వల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్ సూచించారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి అక్కడి జనాలకు అవగాహన కల్పించారు. వరద నీరు పలు చోట్ల నిల్వ ఉండే పరిస్థితి ఉందని ఎప్పటికప్పుడు ఆయిల్స్ బాల్స్ వేసుకుని దోమల బెడదను నివారించుకోవాలని అన్నారు. మురికి కాలువల్లోని నీరు వాడల్లోకి వస్తే దోమల నిల్వకు అవకాశం ఉంటుందన్నారు. దీంతో మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. ఓ ప్రైవేట్ పాఠశాల, కాలనీల్లో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు

●వచ్చే నెల రెండో వారంలో ప్రారంభం కానున్న వన మహోత్సవంలో భాగంగా మండలంలో లక్షా యాభై వేల మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఎంపీడీవో శంకర్ తెలిపారు. ఇప్పటికే 19 నర్సరీల్లో పండ్లు, నీడ, అందాలను పంచే రకరకాలు మొక్కలను పెంచుతున్నామని చెప్పారు. రోడ్లకు ఇరువైపుల, ఇళ్లల్లో, ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, ఆలయాల వద్ద మొక్కలు నాటే కార్యాచరణ చేశామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఆ ప్రక్రియ మొదలు పెడతామని పేర్కొన్నారు.

●మండలంలోని దుంపెటకు చెందిన భాగ్యమ్మ అనే మహిళ అనారోగ్యంతో బాధ పడుతుండగా చికిత్స నిమిత్తం వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రు. 80 వేలు ఎల్‌వోసీ మంజూరు చేశారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు.